క్లుప్తంగా

ఓటు వేసి వస్తుండగా ప్రమాదం



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులు

గీసుకొండ:మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆర్చ్ గేట్ సమీపంలో వరంగల్–నర్సంపేట రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఖానాపురం మండలం రంగంపేటకు చెందిన వి.రవీందర్, ఆయన భార్య మానస, కుమారులు హర్షవర్ధన్, చైతన్య గ్రామంలో ఓటు వేసి వస్తుండగా సాయంత్రం వరంగల్ వైపు నుంచి వస్తున్న వారి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మానసకు తీవ్ర గాయాలు కాగా మిగతా వారికి స్వల్ప గాయాలు కాగా వారికి చికిత్స అందిస్తున్నారు. పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

సాగర్ ఎడమకాల్వలో జారిపడి వ్యక్తి మృతి

మునగాల(కోదాడ): సాగర్ ఎడమకాల్వలో ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. వరంగల్ జిల్లాకు చెందిన అజ్గర్ అలీ(48) భార్య షహనాజ్ సూర్యాపేట జిల్లా నడిగూడెం గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ వైద్యురాలిగా పనిచేస్తోంది. దీంతో అజ్గర్ అలీ కుటుంబం కొంత కాలంగా మునగాల మండలంలోని బరాఖత్‌గూడెంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. గురువారం సాయింత్రం ఏడు గంటల సమయంలో అజ్గర్ అలీ తన కుమార్తెను తీసుకొని మునగాల శివారులోని సాగర్ ఎడమకాల్వలో స్నానం చేసేందుకు వెళ్లాడు. కుమార్తెకు స్నానం చేయించి ఒడ్డున కూర్చోబెట్టి తనూ స్నానం చేసేందుకు ఉపక్రమించాడు. ఈ క్రమంలో అజ్గర్ అలీ కాలుజారి కాల్వలో పడి మునిగిపోయాడు. కుమార్తె కేకలు వేయడంతో పరిసర ప్రాంతానికి చెందిన రైతులు కాల్వలోకి దిగి వెతకగా అజ్గర్ అలీ మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మునగాల పోలీసులు తెలిపారు.

'అరూరి గో బ్యాక్'



ఐనవోలు: మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అరూరి రమేష్ గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు. గురువారం మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. సింగారం, ముల్కలగూడెం, కొండపర్తి, వనమాల కనపర్తి గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను సందర్శించిన అనంతరం ఒంటి మామిడిపల్లికి చేరుకున్నారు. కాగా ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు అరూరి రమేష్ గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రెవెన్యూ గ్రామం కాకుండా ఎమ్మెల్యే రమేష్ అడ్డుకున్నాడని ఆరోపణలు చేస్తూ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పోలింగ్ స్టేషన్‌లోకి అరూరి వెలుతుండగా ఒక్కసారిగా కాంగ్రెస్ నాయకులు లోపలికి చొచ్చుకుని వచ్చారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు చేయి చేసుకునే ఉద్రిక్త పరిస్థితి స్వల్పకాలంలో తలెత్తింది.

పోలింగ్ బూత్‌లో కార్పొరేటర్ ప్రచారం



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

కాశిబుగ్గ: వరంగల్ 18వ డివిజన్ క్రిస్టియన్ కాలనీ గ్రెయిన్ మార్కెట్ స్కూల్‌లోని బూత్ వద్ద పోలింగ్ గడువు ముగుస్తున్న సమయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి స్థానిక కార్పొరేటర్ వస్కుల బాబు ప్రచారం చేశారు. ఇది గమనించిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కార్పొరేటర్‌ను బయటకు పంపాలంటూ నినాదాలు చేశారు. అప్పటికి అక్కడే ఉన్న పోలీసులు పట్టించుకోకపోవడంతో మూసి ఉన్న గేటును బద్దలు కొట్టి లోపలకు వెళ్లి వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. పోలీసులు బూత్ వద్దకు చేరుకుని అక్కడున్న వారందరిని చెదరగొట్టారు.

ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు

ఖిలా వరంగల్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో దివ్యాంగులు, వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారికి తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ సహకారం అందించారు. వీల్ చైర్‌లో తీసుకుచ్చి ఓటు వేయించి తిరిగి ఇంటికి చేర్చారు.

నర్సంపేట : ఓటు వేయడానికి బారులుదీరిన ప్రజలు



చెన్నారావుపేట : తొలిసారి ఓటు వినియోగించుకున్న యువతులు



నర్సంపేట రూరల్ : వృద్ధులను తీసుకెళ్తున్న అంగన్‌వాడీ టీచర్



పోలింగ్ ప్రశాంతం

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గవ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. 283 పోలింగ్ బూత్‌లలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 టల వరకు కొనసాగగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి నల్లబెల్లిలో, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి చెన్నారావుపేట మండలం అమీనాబాద్‌లో, బీజేపీ అభ్యర్థి కంభంపాటి ప్రతాప్ నర్సంపేటలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని 26 గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికలు చిన్న చిన్న సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం మందకొడిక ఓటర్లు వచ్చినప్పటికి మధ్యాహ్నం వరకు వేగం పుంజుకుంది. మహేశ్వరంలోని 145వ బూత్‌లో మధ్యాహ్నం గంట పాటు ఈవీఎం ప్యాడ్ మొరాయించింది. అధికారులు కొత్త వీవీ ప్యాడ్‌ను ఏర్పాటు చేసి పోలింగ్‌ను కొనసాగించారు.

సంగెం : మండల కేంద్రంతో పాటుగా పల్లారుగూడలో సాయంత్రం వెంకటాపూర్‌లో వీవీ ప్యాట్లు కాసేపు మొరాయించడంతో పల్లారుగూడలో బ్యాటరీ మార్చి మిగిలిన చోట్ల సాంకేతిక సమస్యను పరిష్కరించడంతో ఎన్నికల ప్రక్రియ సాగింది. పల్లారుగూడ, మొండ్రాయి, గవిచర్ల, తీగరాజుపల్లి, షాపూర్ తదితర గ్రామాల్లో పోలింగ్ ముగిసే సమయానికి ఓటర్లు భారీగా చేరుకోవడంతో వారందరికి పీఓలు నంబర్ల చీటిలు ఇచ్చి అందరు ఓటు హక్కు వినియోగించుకునేలా చేశారు. షానూర్‌లో 7, పల్లారుగూడలో 8–11 నిమిషాల వరకు పోలింగ్ కొనసాగింది. మండల కేంద్రంలోని 215 బూత్ మోడల్ పోలింగ్ కేంద్రంగా ఎంపికచేయడంతో ఓటర్లను ఆకట్టుకునేలా, ఆకర్షించేలా సుందరంగా అలంకరించారు. మండలంలో 85 శాతానికి పైగా ఓటింగ్ జరిగింది.

మొరాయించిన ఈవీఎంలు

చెన్నారావుపేట: చెన్నారావుపేట, అమీనాబాద్ గ్రామాలలోని పోలింగ్ సెంటర్‌లలో ఈవీఎంలు మొరాయించగా గంట ఆలస్యంగా, మరి కొన్ని సెంటర్‌లో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఎన్నికల సరళిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు.

చెన్నారావుపేట: మండలంలోని అమీనాబాద్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి ఉదయం 9 గంటలకే పోలింగ్ కేంద్రానికి చేరుకుని తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి అభ్యర్థి మొగిళి ప్రతాప్‌రెడ్డి పాపయ్యపేటలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థి బానోతు ప్రేమ్‌నాయక్ తన ఓటు హక్కును లింగగిరిలో వినియోగించుకున్నారు.

నెక్కొండ: మండల కేంద్రోలని 248 పోలింగ్ కేంద్రంలో 1095 మంది ఓటర్లు, రెడ్లవాడ 262లో 974 మంది, మడిపల్లి 275లో 1291 మంది ఓటర్లు అధికంగా ఉండడంతో గంటల కొద్ది ఓటర్లు పెద్ద సంఖ్యలో క్యూ లైన్‌లో ఉండాల్సి వచ్చింది. రెడ్లవాడ పోలింగ్ స్టేషన్‌లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి భార్య జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న పోలింగ్ సరళి తెలుసుకునేందుకు రావడంతో కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో రెండు పార్టీ మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. ఎస్సై జానీపాషా చేరుకొని ఇరువర్గాలను బయటకు పంపించారు.

కార్యకర్తల మధ్య ఘర్షణ

రాయపర్తి: మండల కేంద్రంతోపాటు మండలంలోని మైలారం గ్రామాలను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు పోలింగ్‌కేంద్రాలను సందర్శించి పరిశీలించి అభివాదం చెబుతూ వెళ్లారు. మంత్రి వెళ్లాక కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య తోపులాట జరగడంతో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి.

నల్లబెల్లి: ఉదయం పోలింగ్ మందకోడిగా ప్రారంభమైంది. రైతులు, కూలీలు మధ్యాహ్నం తరువాత ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లు రాత్రి 8 గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నర్సంపేట ఏసీపీ తిరుమల్ పర్యవేక్షణలో రూరల్ సీఐ పుల్యాల కిషన్ ఎస్సై నైనాల నగేష్ పర్యవేక్షణలో కేంద్ర బలగాలు బందోబస్తును పర్యవేక్షించారు.

గీసుకొండ: మండలంలో 83.66 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు తెలిపారు. సీపీ కిషోర్‌ఝా, డీసీపీ రవీందర్ తోపాటు బీజేపీ, బీఆర్ఎస్ , కాంగ్రెస్ అభ్యర్థులు డాక్టర్ కాళీప్రసాద్, చల్లా ధర్మారెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సతీమణి జ్యోతి ఎలుకుర్తి పోలింగ్ బూత్‌లోకి కార్యకర్తలతో ప్రవేశించగా ఆమె ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినా పట్టించుకోవడం లేదంటూ కాంగ్రెస్ నాయకులు తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఆమెపై ఈసీకి ఫిర్యాదు చేసినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

దుగ్గొండి: రేకంపల్లి గ్రామానికి చెందిన 105 ఏళ్ల వృద్ధురాలు పింగిలి కాంతమ్మ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొగర్రాయి , పీజీతండా గ్రామాలలో పోలింగ్ కేంద్రం వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు ఘర్షణ పడి తోసుకున్నారు. ఎస్సై పరమేష్ ఘటన స్థలాలకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. తొగర్రాయి కేంద్రాన్ని వరంగల్ సీపీ అంబర్‌కిషోర్‌ఝా పరిశీలించారు. మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్‌పీ, బీజేపీ పార్టీల అభ్యర్థులు పెద్ది సుదర్శన్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, గుండాల మదన్‌కుమార్, కంభంపాటి ప్రతాప్‌లు పరిశీలించారు. పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాష్‌రెడ్డి కేశవాపురంలో వినియోగించుకున్నారు.

నల్లబెల్లి: బీఆర్ఎస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఎస్పీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి గుండాల మధన్ కుమార్ నల్లబెల్లిలో గురువారం ఓటు వేశారు.

వర్ధన్నపేట: పట్టణంలోని జెడ్పీఎస్ఎస్ పోలింగ్ కేంద్రాన్ని వరంగల్ నగర పోలీస్ కమీషనర్ అంబర్ కిశోర్‌ఝా సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోలీసులకు సూచనలు ఇచ్చారు. సాయంత్ర 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

వర్ధన్నపేట: వర్ధన్నపేట బీజేపీ తరపున పోటీ చేస్తున్న కొండేటి శ్రీధర్ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయమే వర్ధన్నపేట పట్టణంలోని పుస్కోస్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి వచ్చి తనతో పాటు కుటుంబ సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు సైతం పుస్కోస్ పాఠశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పర్వతగిరి: వర్ధన్నపేట నియోజకవర్గం పోలింగ్‌లో భాగంగా పర్వతగిరి మండలంలో 73శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. చౌటపల్లిలో ఒక ఈవీఎం మొరాయించడం తప్ప ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదు. పోలింగ్ చీటీలు పంచకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. పర్వతగిరి పోలింగ్ కేంద్రంలో దయాకర్‌రావు తన మొదటి ఓటు వేసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఖానాపురం: ఖానాపురం, ఇతర గ్రామాల్లో ఈవీఎంలు నత్తనడకన పని చేయడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఈవీఎంలు నెమ్మదించడంతో ఖానాపురం, అశోక్‌నగర్, బుధరావుపేట, ధర్మారావుపేట, మంగళవారిపేట గ్రామాల్లో ఓటర్లు సాయంత్రం 5గంటల తర్వాత బారులు తీరారు. పోలింగ్ బూత్‌లలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పర్యవేక్షణ చేశారు.

మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు

రాయపర్తి: మండలంలోని కొలన్‌పల్లిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు వచ్చిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఎదురుగాలే వీచినట్లయింది. పోలింగ్ కేంద్రాలకు వెలుతుండగా కాంగ్రెస్ నాయకులు మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు



పర్వతగిరి : బూర్గుమళ్లలో బారులు తీరిన ఓటర్లు



నర్సంపేట రూరల్ : మహేశ్వరం పాఠశాలలో..



నెక్కొండ : వెంకటాపురంలో..



ఖానాపురం: ఓటు వేస్తున్న ప్రజలు



నల్లబెల్లి: పోలింగ్ కేంద్రంలో మదన్‌కుమార్



చెన్నారావుపేట : జల్లిలో..



దుగ్గొండి: రేకంపల్లిలో శతాధిక వృద్ధురాలు



సంగెం : కుంటపల్లిలో బారులు తీరిన ఓటర్లు



ఖానాపురం : మంగళవారిపేటలో..



నర్సంపేట రూరల్ : సర్వాపురంలో పోలింగ్‌ను పరిశీలిస్తున్న సీఐ రవికుమార్



చెన్నారావుపేట : దివ్యాంగులను పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న ఐకేపీ సిబ్బంది



సంగెం : వృద్ధురాలిని స్వాగతిస్తున్న అధికారులు



సంగెం : మోడల్ పోలింగ్ కేంద్రం



పర్వతగిరి : ఓటు వేసిన యువతులతో అరూరి



నల్లబెల్లి : ఓటర్లతో పెద్ది సుదర్శన్‌రెడ్డి



నల్లబెల్లి : నందిగామలో..



రాయపర్తి: పోలింగ్ కేంద్రానికి వస్తున్న ఎర్రబెల్లి



నెక్కొండ : తొలిసారిగా ఓటు వేసిన యువత



సంగెం : కుంటపల్లిలో చల్లా ధర్మారెడ్డి



నర్సంపేట రూరల్ : ఓటర్లతో దొంతి మాధవరెడ్డి



సంగెం : కుంటపల్లిలో రేవూరి ప్రకాష్‌రెడ్డి



దుగ్గొండి: కేశవాపురంలో రేవూరి ప్రకాష్‌రెడ్డి



రాయపర్తి : వృద్ధుడిని తీసుకొస్తున్న పోలీసులు



గీసుకొండ: ధర్మారం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా



పర్వతగిరి : ఈవీఎం మొరాయించడంతో ఎదురు చూస్తున్న ఓటర్లు

విలీన గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు

మడికొండ: కాజీపేట మండలంలోని మడికొండ, తరాలపల్లి, భట్టుపల్లి, కొత్తపల్లి, కడిపికొండ, టేకులగూడెం, అమ్మవారిపేట మడికొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7గంటలకు పోలింగ్ మొదలైంది. మధ్యాహ్న వరకు మందకొడిగా జరిగిన పోలింగ్.. ఆ తర్వాత పుంజుకుంది. పలు గ్రామాల్లో ఓటర్ స్లిప్‌లు అందక ఓటర్లు అయోమయానికి గురయ్యారు. విలీన గ్రామాల్లోని 31పోలింగ్ బూత్‌ల్లో 31,836 మంది ఓటర్లకు 22,839 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలో 70.07 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఓటింగ్ సరళిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్, బీజేపీ అభ్యర్థి కొండేటి శ్రీధర్‌తో పాటు అధికారులు పరిశీలించారు. ఎన్నికల భద్రతను మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు, ఎస్సైలు దివ్య, రాజబాబు, పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.



మడికొండ ప్రభుత్వ పాఠశాలలోని బూత్‌లో..



ఎన్నికల సరళిని తెలుసుకుంటున్న అరూరి రమేశ్



ఈవీఎంలను తరలిస్తున్న ఎన్నికల అధికారులు